క్లుప్తంగా

రాజుల దేవి విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

జన్నారం: మండలంలోని కామన్‌పెల్లి గ్రామం కడెం ప్రధాన కాలువ సమీపంలో గురువారం మేదరుల ఆరాధ్య దైవం పాలపు రాజులదేవి విగ్రహ ప్రతిష్టాపన కనుల పండువగా జరిగింది. కామన్‌పెల్లి, దేవునిగూడ గ్రామాలకు చెందిన మేదరులు డప్పుసప్పుళ్లతో ర్యాలీగా వెళ్లి రాజుల దేవికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మేదరి సంఘం మండల ఉపాధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, మండల కోశాధికారి పిల్లి మల్లయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఒడిపల్లి సురేష్ పాల్గొన్నారు.

'రైతు భరోసా' జమ

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం పెట్టుబడి సాయం రైతుభరోసా పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 1,27,469 మంది రైతుల ఖాతాల్లో రూ.114.75 కోట్లు జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకుంటే రైతుభరోసా పథకం నగదు అందుతుందని తెలిపారు.

డీఈవోకు వినతి

మంచిర్యాలఅర్బన్: నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎమ్మార్పీ లేకుండా పాఠ్యపుస్తకాలు, టై, బెల్ట్ విక్రయాలకు పాల్పడుతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలంటూ విద్యార్థిసంఘాల నాయకులు ధర్నా చేశారు. అనంతరం పాఠ్యపుస్తకాలు సీజ్ చేసి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్, యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టిన రోజు



బెల్లంపల్లి: కేక్ కట్ చేస్తున్న నాయకులు

భీమారం/జన్నారం/లక్సెట్టిపేట/దండేపల్లి/రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్/బెల్లంపల్లి/కాసిపేట/పాతమంచిర్యాల/మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ అధినాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. దేశంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి పగ్గాలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వం దేశానికి అవసరమని పేర్కొన్నారు. పలుచోట్ల ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. భీమారంలో ప్రభుత్వప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్' ఆపాలి

పాతమంచిర్యాల: ఆపరేషన్ కగార్‌ను ఆపాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి అన్నారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా జూన్ 23న 'చలో రాజ్‌భవన్' విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంకుల రాజేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి మహేశ్, పర్ల శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి



ఏసీపీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా యువకులు ఆటోలు, బైకులు నడుపుతున్నారని తెలిపారు. వేగంగా నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారని వివరించారు. అజాగ్రత్తగా, అతివేగంగా ఆటో నడిపి ఓ ఆటో డ్రైవర్ సుభాష్‌నగర్ బస్తీకి చెందిన ఆర్శెళ్ల బాలుడి ప్రాణాలు తీశాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం.చిన్నరాజం, రత్నం ఐలయ్య, నాతరి శివకృష్ణ, పుల్లూరి రాము, రాచకొండ సతీష్, కుమ్మరి శ్రీనివాస్, మచ్చ రాజేష్, రేణిగుంట్ల శంకర్, మిట్టపల్లి మల్లయ్య, చంద్రశేఖర్, కాంపల్లి శంకర్ పాల్గొన్నారు.

ఇరుకు గదుల్లో హెడ్ పోస్టాఫీస్



స్థలం సరిపోక బయట వరండాలో రికార్డులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ అద్దె భవనం, ఇరుకు గదుల్లో కొనసాగుతుంది. మెయిల్స్, అకౌంట్స్ విభాగం, ట్రెజరీ, ఎస్‌బీసీవో (ఇన్‌స్పెక్షన్ వింగ్) ఉన్నాయి. వీటికి ప్రత్యేకంగా గదులు ఉండాల్సి ఉండగా, ఒక్క మెయిల్స్ విభాగానికి మాత్రమే ప్రత్యేక గది ఉంది. మిగితా మూడు విభాగాలు ఒకే హాల్లో ఉన్నాయి. వివిధ సేవల కోసం వెళ్తే రద్దీ ఎక్కువగా ఉంటే బయటే నిల్చోవాల్సి వస్తోందని ఖాతాదారులు వాపోతున్నారు. ఇందులోనే 33సబ్ పోస్టాఫీస్‌లకు సంబంధించిన ఫైల్స్ భద్రపరుస్తున్నారు. ర్యాక్‌లు కూడా ఏర్పాటు చేసే స్థలం లేదు. స్థలం సరిపోకపోవడంతో రికార్డులు మూటలుగా కట్టి ఉంచుతున్నారు. సిబ్బంది, ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు.



జిల్లా కేంద్రంలోని హెడ్‌పోస్టాఫీస్





సిబ్బంది పనిచేసే చోట మూటలు కట్టి ఉన్న రికార్డులు

ఇన్‌చార్జీల పాలన!

- డిప్యూటేషన్లపై వెళ్లిన అధికారులు, సిబ్బంది
- రెగ్యులర్ ఉద్యోగులు లేక అవస్థలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం(ఎంపీపీ)లో ఇన్‌చార్జీల పాలన సాగుతోంది. ఎంపీడీవో అధికారి నుంచి మొదలు.. అంతా కూడా ఇంచార్జీలే.. హాజీపూర్ ఎంపీడీవో రెగ్యులర్ పోస్టు ఉన్నా.. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో భీమారం ఎంపీడీవోగా డెప్యూటేషన్‌పై వెళ్లారు. ఇక్కడ ఆయన స్థానంలో దండేపల్లి ఎంపీడీవో ప్రసాద్ ఇంచార్జి ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక ఎంపీవో శ్రీనివాసరెడ్డిని డెప్యూటేషన్‌పై వేమనపల్లి ఎంపీవోగా బదిలీ చేశారు. జన్నారం ఎంపీవోగా ఉన్న ఉమర్‌షరీఫ్‌ను హాజీపూర్ ఇన్‌చార్జి ఎంపీవోగా నియమించారు. ఇక కార్యాలయంలో రెగ్యులర్ ఏవోగా ఉన్న బాలకిషన్ జెడ్పీ కార్యాలయంలో డెప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తుండగా ఏవో పోస్టు ఖాళీగా ఉంది. సీనియర్ అసిస్టెంట్ కొండయ్య ఇటీవల అనారోగ్యం బారిన పడగా, దాదాపు నెల రోజులుగా సెలవులో ఉండటంతో ఈ పోస్టు కూడా ఖాళీగానే దర్శనమిస్తోంది. జూనియర్ అసిస్టెంట్ అరుణ్ డెప్యూటేషన్‌పై దండేపల్లిలో పనిచేస్తున్నాడు. పంచాయతీ రాజ్ ఏఈ పోస్టింగ్ ఖాళీగా ఉండటంతో ఖుర్షీద్‌అన్వర్ ఇన్‌చార్జిగా పీఆర్ ఏఈగా పనిచేస్తున్నారు. ఒక టైపిస్ట్, నలుగురు సబ్ ఆర్డినేట్లు మాత్రం రెగ్యులర్ పోస్టుల్లో ఉన్నవారు ఉన్నారు. ఇద్దరు ఈ–పంచాయతీ ఆపరేటర్లకు ఒకరు ఉండగా, మరో ఆపరేటర్ సిద్దార్థ డీపీవో కార్యాలయంలో డెప్యూటేషన్‌పై వెళ్లి పనిచేస్తున్నాడు. మొత్తంగా హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో కార్యకలాపాలన్నీ కూడా ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. ఇక ఇన్‌చార్జిలకు పూర్తిస్థాయి బాధ్యతలు కూడా ఉండటంతో, అటు వారి పోస్టింగ్‌కు.. ఇటు ఇన్‌చార్జి పోస్టింగ్‌కు న్యాయం చేయలేకపోతున్నారు. ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం పెరగడంతో పనిభారం పెరిగిపోతుండగా, విధులు సరిగ్గా నిర్వర్తించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇకనైనా కలెక్టర్ జోక్యం చేసుకొని మండలానికి పూర్తిస్థాయి అధికారులను నియమించాలని కోరుతున్నారు.



హాజీపూర్ ఎంపీపీ కార్యాలయం

అధికారి	హోదా	పోస్టింగ్	డెప్యూటేషన్
మధుసూదన్	ఎంపీడీవో	హాజీపూర్	భీమారం
ప్రసాద్	ఎంపీడీవో	దండేపల్లి	హాజీపూర్
శ్రీనివాసరెడ్డి	ఎంపీవో	హాజీపూర్	వేమనపల్లి
ఉమర్‌షరీఫ్	ఎంపీవో	జన్నారం	హాజీపూర్
అరుణ్	జూనియర్ అసిస్టెంట్	హాజీపూర్	దండేపల్లి
కొండయ్య	సీనియర్ అసిస్టెంట్... (సెలవులో ఉన్నారు)	....	....
ఖర్షీద్ అన్వర్	పీఆర్ ఏఈ ఇంచార్జిగా ఉన్నారు..	....	....

సికిల్‌సెల్‌పై అవగాహన కలిగి ఉండాలి

నెన్నెల: సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. సికిల్‌సెల్ దినోత్సవం సందర్భంగా గురువారం జంగాల్‌పేటలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వ్యాధి సోకిన వారిలో రక్తహీనత తలెత్తుతుందని, రోగనిరోధక శక్తి తగ్గడంతో ఇన్ఫెక్షన్ పెరుగుతుందన్నారు. ముందస్తు రోగనిర్ధారణ పరీక్షలతో తర్వాతి తరాలకు జబ్బు సంక్రమించకుండా జాగ్రత్త పడొచ్చన్నారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజనులకు రక్తపరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధి గ్రస్తులకు రక్త పరీక్షలు

కాసిపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వైద్యాధికారి రవి కిరణ్ ఆధ్వర్యంలో సికిల్ సెల్ వ్యాధి ఉన్న చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారులతో వైద్యుడు, సిబ్బంది

ఎరువుల దుకాణాలు తనిఖీ

జన్నారం: రైతులు పత్తి, వరి పంటకు సంబంధించిన విత్తనాలు ఎరువుల దుకాణాల్లో కొన్నప్పుడు డీలర్లు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత అన్నారు. మండల కేంద్రంలో ఎరువుల విక్రయ కేంద్రాల్లో గురువారం తనిఖీలు చేశారు. పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల భూమికి నత్రజని అందుతుందని, దీనివల్ల యూరియా వాడకం తగ్గి పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. డీలర్లు సీడ్, ఫెర్టిలైజర్, పెస్టిసైడ్ రోజువారి డేటాను కచ్చితంగా స్టాక్ రిజిస్టర్లలో బిల్ బుక్ లలో నమోదు చేయాలని సూచించారు. ఈ పాస్ మెషిన్ ద్వారానే ఎరువుల విక్రయాలు జరపాలన్నారు. సహాయ సంచాలకులతో పాటుగా మండల వ్యవసాయ అధికారి.సంగీత, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అనిత

దరఖాస్తు గడువు పొడగింపు

మంచిర్యాలటౌన్: జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 18వ తేదీ నుంచి 27వ తేదీకి పొడిగించినట్లు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ, తెలంగాణ వికలాంగుల సహాయక సమితి ద్వారా జిల్లాలోని ప్రతి దివ్యాంగుడికి సహాయ ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాకు 45 రెట్రోఫిట్మెంట్ స్కూటీలు, 14బ్యాటరీ వీల్‌చైర్స్, 18మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిళ్లు, 1 బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికిల్, 5 హైబ్రిడ్ వీల్ చైర్లు, 14ల్యాప్‌టాప్స్(డిగ్రీ విద్యార్థులకు), 7 ల్యాప్టాప్స్(ఉన్నత సాంకేతిక విద్య), 22 టాబ్స్, 2 ఫైవ్‌జి స్మార్ట్ ఫోన్లు, 11 చేతికర్రలు, 3 వీల్ చైర్లు, 1 చెవిటి మిషన్, 6 ట్రై సైకిళ్లు, 6 వీల్ చైర్స్, 23 క్రచెస్, 2 చెవిటి మిషన్లు, 23 వాకింగ్ స్టిక్స్, 11 స్మార్ట్ కేన్స్, 11 ఎం.సి.ఆర్. చెప్పల్ మంజూరైనట్లు తెలిపారు. అర్హత గల దివ్యాంగులు ఆన్‌లైన్‌లో https://tgobmms.cgg.gov.in ఈ నెల 27వ తేదీలోపు పూర్తి వివరాలతో జాగ్రత్తగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు హెల్ప్ లైన్ నంబర్ 155326లో సంప్రదించాలన్నారు.

రిజర్వేషన్ల అమలు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు గురువారం డిమాండ్ చేశారు. హాజీపూర్ మండల కేంద్రంలో బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మధుసూధన్ రావు, విజయ్, రాజన్న పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

భీమిని: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయుర్వేద వైద్యుడు సంజయ్ అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం యోగా శిక్షకురాలు రజిత, విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాలతి, దేవకర్ణ, ఎంఎన్‌వో విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ నెల 21న జరిగే యోగా డే కార్యక్రమం విజయవంతం చేయాలని అవగాహన కల్పించి, అధికారులు యోగాసనాలు వేశారు. యోగా ఇన్‌స్ట్రక్టర్లు నాగా ర్జున, గీతాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ అంజయ్య, ఏఎస్ వో అమరేందర్, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.



యోగా పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

21న యోగా వేడుకలు

మంచిర్యాలటౌన్: ఈ నెల 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మంచిర్యాల పట్టణంలోని వైశ్యభవన్‌లో ఉదయం 6గంటల నుంచి 7:30గంటల వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆయుష్ నుంచి సర్టిఫికేట్లు ప్రధానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

మోదీ పాలనలో అన్నింటా అభివృద్ధి

నెన్నెల: ప్రధాన నరేంద్రమోదీ 11ఏళ్ల పాలనలో దేశం అన్నింటా అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అంగలి శేఖర్ అధ్యక్షతన చిత్తాపూర్‌లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప్ సభ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వెంకటేశ్, అరుణ్, రాజన్న , యాదగిరి, మహేందర్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈవో

తాండూర్: మండలంలోని బారెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో మల్లేశం, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం.ఉమారాణి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

సాగులో ఉన్న పేదలకు పట్టాలివ్వాలి

నెన్నెల: ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్న నిరుపేదలకు పట్టాలివ్వాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోడు సాగు చేసుకుంటున్న దళిత గిరిజనులపై అక్రమ కేసులు పెడుతూ, అటవీ శాఖ అధికారులు వేధిస్తున్నారన్నారు. భూ భారతిలో అర్హులను గుర్తించి పట్టాలివ్వాలని కోరారు. పట్టాలు సాధించేందుకు ఈ నెల 25న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు

జన్నారం: ఎంఈవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జన్నారం క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి సుమారుగా 30మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 10మంది బాలురు, ఆరుగురు బాలికలను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల కళాశాలలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై ఆర్‌బీఐ ఏజీఎం సబ్బత్ రాములు, ఎల్‌డీఎం తిరుపతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అనూష, వైస్ ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

కాసిపేట/వేమనపల్లి/బెల్లంపల్లిరూరల్/లక్సెట్టిపేట: ఈ నెల 21, 22వ తేదీల్లో మంచిర్యాలలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, బెల్లంపల్లి మండల కార్యదర్శి బి.లక్ష్మీనారాయణ, కాసిపేట మండల కార్యదర్శి దాగం మల్లేష్, లక్సెట్టిపేట మండల నాయకులు మేదరి దేవవరం అన్నారు. మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు.

బొగ్గుబాయి వార్తలు

డీజీఎంను కలిసిన బీసీ నేతలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా నూతన డీజీఎం(పర్సనల్)గా బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్‌ను సింగరేణి బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అసోసియేషన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శులు బరుపటి మారుతి, బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, డీవైపీఎం రాజేష్ పాల్గొన్నారు.

హైస్కూల్ థీమ్ సాంగ్ ఆవిష్కరణ

మందమర్రిరూరల్: సింగరేణి హైస్కూల్ ఆవరణలో హైస్కూల్ స్వర్ణోత్సవాల్లో భాగంగా తయారు చేసిన థీమ్‌సాంగ్‌ను ఏరియా జీఎం దేవేందర్ గురువారం ఆవిష్కరించారు. థీమ్ సాంగ్ ద్వారా సింగరేణి విద్యా సంస్థల లక్ష్యాలు, విద్యార్థుల ఆకాంక్షలు, విద్యా మార్గదర్శకత ప్రతిబింబిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీఈఎస్ కార్యదర్శి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ సునీల్‌కుమార్, హైస్కూల్ కరస్పాండెంట్ శ్యాంసుందర్, విద్యార్థులు ఉన్నారు.

రిఫరల్ కేసులు బోర్డుకు పిలువాలి

శ్రీరాంపూర్: మెడికల్ బోర్డులో హయ్యర్ సెంటర్‌కు రిఫరల్ చేసిన కేసులను తిరిగి వెంటనే మెడికల్ బోర్డుకు పిలువాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేష్, నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్ గురువారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు యోగా తరగతులు

శ్రీరాంపూర్: ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని జీఎం కార్యాలయంలోని అధికారులకు, ఉద్యోగులకు యోగాలో శిక్షణ ఇస్తున్నారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం 4వ రోజు శిక్షణ అందించారు. ఈ నెల 21న జరిగే యోగా వేడుకల్లో అత్యున్నత ప్రదర్శన ఇవ్వాలని డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు శ్రీధర్, అమర్నాథ్ రెడ్డి, కాంతారావు, యోగా గురువు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పొంచి ఉన్న ప్రమాదం

భీమారం: మండల కేంద్రంలోని పద్మశాలి వీధికి వెళ్లే ప్రధాన రహదారిలో ఎండిపోయిన (మోడుబారిన) చెట్టును తొలగించేందుకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపించారు. ఎండిపోయిన చెట్టు ఏ క్షణమైనా రోడ్డు పై పడిపోయే ప్రమాదం ఉందని, ఏ నష్టం జరగక ముందే అధికారులు చర్యలు తీసుకొని చెట్టు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : సతీష్‌రెడ్డి, ప్రత్యేకాధికారి, భీమారం
ఫోన్ నంబర్ : 98483 84636



చెక్కు అందజేత

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిది స్వయం సహాయక సంఘాలకు గురువారం రూ.కోటి రుణం చెక్కును మెప్మా టీఎంసీ రఘురాంతో కలిసి యూనియన్ బ్యాంకు మేనేజర్ మహేందర్ అందించారు.